సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాగేశ్వరరావు

## ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్, 16 : ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని వ్యవసాయ శాఖ మంత్రి, మానుకోట పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 19న మానుకోట పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ నామినేషన్ వేస్తారని, ఈ కార్యక్రమానికి స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి వస్తారని తెలిపారు. ఉదయం నామినేషన్, మధ్యాహ్నం పట్టణంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ మురళీనాయక్, రామచంద్రూనాయక్, దొంతి మాధవరెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్ చంద్రారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

## ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేయొద్దు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 16 : ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేయొద్దని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కార్య నిర్వహణ కార్యదర్శి ప్రొపెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం పట్టణంలోని టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజల కోసం నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని, కేంద్ర ప్రభుత్వం సిలబస్‌ను మార్చేక్రమంలో చరిత్రను వక్రీకరించాలని చూస్తున్నదన్నారు. కొందరికే విద్య అనే నినాదం కాకుండా ప్రతి ఒక్కరికీ విద్యను అందించాలన్నారు. అశాస్త్రీయ విద్య అజ్ఞానం వైపు నడిపిస్తుందని, మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు బలాష్టి రమేశ్, విష్ణువర్ధన్, ఉపేందర్, విద్యాసాగర్, గోవర్ధన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**ప్రకటన**

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మరిపెడ బ్రాంచ్** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **మచ్చ అరుణ**, W/o : **మురళి**, **వయస్సు** : 46 సం||లు, **వృత్తి** : వ్యాపారం, **నివాసం** : ఇ.నెం. తాళ్ళఊకల్, మరిపెడ మండలం, మహబూబాబాద్ జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్షయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి :** గ్రామ పంచాయితీ, తాళ్ళఊకల్, మండలం, మండల పరిషత్తు, మరిపెడ, జిల్లా, జిల్లా పరిషత్తు మహబూబాబాద్ మరియు జిల్లా రిజిస్ట్రార్ వరంగల్, సబ్ రిజిస్ట్రార్ మహబూబాబాద్ వారి పరిధిలో గల తాళ్ళ ఊకల్ గ్రామ పంచాయితీ పరిధిలో గల గృహమునకు జి.పి. డోర్ నెం. 1-24 (అస్సెస్‌మెంట్ నెం.30)గా గల ఆర్.సి.సి.షీట్ కప్పుగల గృహ నిర్మిత విస్తీర్ణము 556.49 చ||ఫీట్లు. ఏ.సి. షీటు కప్పు గల గృహ నిర్మిత విస్తీర్ణము 515.32 చ||ఫీట్లు గృహముతో సహా స్థల వైశాల్యం 284.44 చ||గ||లు సమము 237.79 చ||మీ||లు, **డాక్యుమెంట్ నెం. 484/2024** గల ఆస్తికి సరిహద్దులు : **తూర్పు:** కారింగుల చంద్రయ్య గృహము, **పడమర** : గ్రామ పంచాయితీ రోడ్డు, **ఉత్తరం** : దాత గృహము, **దక్షిణం** : గ్రామ పంచాయితీ రోడ్డు.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**ప్లాట్లు అమ్మబడును**

★వరంగల్ ట్రైసిటికి హైవేలను అనుకొని ఉన్న మా వెంచర్లలో ప్లాట్లు తక్కువ ధరలలో అమ్మబడును. సంప్రదించవలసిన సెల్ నెంబర్. 9701396797.
NTW-323041

**లోన్స్**

★SBH లో ఖాతా ఉన్న ప్రభుత్వ ఉద్యోగస్తులకు శుభవార్త, ఎటువంటి సమస్యలున్న Solve చేసి లోన్స్ ఇప్పించబడును. సంప్రదించండి సెల్ : 9493910808.
NTW-00

**WANTED**

★Wanted Cinema Managers to work at Asian Gemini theatre, experience: 5-10 years, interested ones call to 8121021251, hr.corp@asiancinemas.in
NT-6583

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

# మానుకోటపై గులాబీ జెండా ఎగరేయాలి

**బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు**

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల్లో మూడోసారి మానుకోటపై గులాబీ జెండాను ఎగరేయాలని పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు నివాసంలో రాజ్యసభ సభ్యుడు ఒద్దిరాజు రవిచంద్ర, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ సమావేశమయ్యారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలపై చర్చించారు. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పని చేసేందుకు సమాయత్తం కావాలని తీర్మానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజల్లో మంచి పేరు లేదన్నారు. అనంతరం రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన రవిచంద్రను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, పట్టణ అధ్యక్షుడు గద్దె రవి పాల్గొన్నారు.

ఎంపీ రవిచంద్రను సన్మానిస్తున్న ఎంపీ కవిత, ఎమ్మెల్సీలు రవీందర్‌రావు, సత్యవతి రాథోడ్

# అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్ సింగ్**

మహబూబాబాద్, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులందరూ తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్ సింగ్ సూచించారు. ఓటరు చైతన్య కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల్లో కంటే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడంతో పాటు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. దేశ భవిష్యత్‌ను నిర్దేశించేది ఒక్క ఓటు హక్కు మాత్రమేనన్నారు. ప్రతిఒక్కరూ ఓటు ప్రాధాన్యతను తెలుసుకునేలా విద్యా సంస్థల్లో స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కళాకారుల బృందం ఓటు హక్కు వినియోగంపై పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సవ్ టొప్పో, ఎం డేవిడ్, డీఎఫ్‌వో బత్తిని విశాల్, ట్రైనీ ఐపీఎస్ పండరి చేతన్, అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య, ఆర్డీవో అలివేలు, స్వీప్ నోడల్ అధికారి మరియన్న, డీఎంహెచ్‌వో కళావతిబాయి, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌యాదవ్, డీఈవో రామారావు, పశుసంవర్ధకశాఖ అధికారి సుధాకర్, గ్రౌండ్ వాటర్ అధికారి సురేశ్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎన్‌వైకే కోఆర్డినేటర్ అవినాశ్ పాల్గొన్నారు.

స్వీప్ అవగాహన ర్యాలీ, 5కే రన్ అనంతరం మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

# వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

- బలపాల పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో
- ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేత

కురవి: కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

కురవి, ఏప్రిల్ 16 : ఎండలు మండుతున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ కళావతిబాయి సూచించారు. ఎన్సీడీ జిల్లా అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, జిల్లా డీపీహెచ్‌ఎన్‌వో మంగమ్మతో కలిసి ఆమె కురవి మండలం బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. సిబ్బంది సమయపాలన పాటించి తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కరువు పనులు చేసే గ్రామీణ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. మాతా శిశు సంరక్షణ చర్యలు సంతృప్తికరంగా ఉండాలని, ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పులు జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు ఆరోగ్య కరమైన జీవనశైలిని అలవర్చుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం బలపాల గ్రామపంచాయతీ పరిధిలోని ఈజీఎస్ పనులు జరుగుతున్న కందులవారి కుంట చెరువును సందర్శించి, అక్కడ పని చేస్తున్న గ్రామస్తులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బలపాల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ బీ స్రవంతి, కృష్ణకుమార్, పంచాయతీ సెక్రటరీ, ఈజీఎస్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ**

డోర్నకల్: డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో కళావతిబాయి మంగళవారం తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్, మెడిసిన్, ఎన్‌సీడీ గది, ల్యాబ్‌ను పరిశీలించారు. ఆరోగ్య మహిళ రికార్డును తనిఖీ చేసి సంక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మల్లాయకుంట తండాలో ఇటీవల క్యాన్సర్‌తో మృతి చెందిన ఆశ వర్కర్ మంగమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 46,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సద్విజ, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ బిందుశ్రీ, డీపీహెచ్‌ఎన్‌వో మంగమ్మ, సీహెచ్‌వో వీరాబాబు, డాక్టర్ కనకదుర్గ, సూపర్‌వైజర్ వెంకన్న, ఏఎన్‌ఎం రాఘవమ్మ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు

నర్సింహులపేట, ఏప్రిల్ 16 : గ్రామాలకు రవాణా సౌకర్యం, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గునిగంటి మోహన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓట్లను దండుకొని పదవులు అనుభవిస్తున్న ప్రజాప్రతినిధులు అభివృద్ధిని మరిచారనారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో నిర్లక్ష్యం చేశారని, గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని ప్రజలను మభ్యపెడుతున్నట్లు తెలిపారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి యాకూబ్, సురేశ్, సోమిరెడ్డి, సర్వన్, రామాచారి, యాదగిరి, సత్తయ్య పాల్గొన్నారు.

## 108లో ప్రసవం

గూడూరు, ఏప్రిల్ 16: మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన ఈసం రమాదేవికి మంగళవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108లో మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గమధ్యంలో పురిటి నొప్పులు ఎక్కువవడంతో అప్రమత్తమైన 108 టెక్నీషియన్ భూక్యా హనుమంతు, పైలట్ రాజు రమాదేవికి సాధారణ ప్రసవం చేశారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండడంతో దవాఖానకు తరలించారు. 108 సిబ్బందిని కుటుంబ సభ్యులు, ప్రోగ్రాం మేనేజర్ నాగేందర్, మెడికల్ ఎగ్జిక్యూటివ్ బత్తిని మహేశ్ అభినందించారు.

# శరపంజరం సినిమాను ఆదరించాలి

**ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి**

సినిమా సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

తొర్రూరు, ఏప్రిల్ 16: జీరో బడ్జెట్‌తో తీసిన శరపంజరం సినిమాను ఆదరించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన గట్టు నవీన్‌కుమార్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన శరపంజరం సినిమా తెలంగాణలో జరిగిన కొన్ని సంఘటనలను కళ్లకట్టినట్లు చూపించారని అన్నారు. జోగిని వ్యవస్థ, గంగిరెద్దుల వారి జీవన విధానంతో తెరకెక్కించిన ఈ చిత్రాన్ని తొర్రూరు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించినట్లు తెలిపారు. ఇక్కడి కళాకారులందరూ నటించడం అభినందనీయమన్నారు. ఈ సినిమా మన చరిత్రను గుర్తు చేసేవిధంగా ఉందని, అందరం అండగా ఉండాలన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రయోగాత్మకంగా తీసిన సినిమాను ఆదరించాలన్నారు. ఈ సినిమాలోని కొన్ని సీన్లు చూశామని, తెలంగాణ పల్లెతనాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారని అన్నారు. నటులందరూ ఇక్కడి వాళ్లే అవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శరపంజరం సినిమా దర్శకుడు హీరో గట్టు నవీన్‌కుమార్, కెమెరామెన్ సిరిపాటి మస్తాన్, నటులు మేరుగు మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.

# మూడేళ్లలోనే 30 టన్నుల దిగుబడి

**ఆయిల్‌పామ్ సాగులో ఆదర్శంగా నిలుస్తున్న రైతు అంజయ్య**

తొర్రూరు, ఏప్రిల్ 16: సంప్రదాయ పంటల సాగుతో విసిగిపోయిన రైతు తూర్పాటి చిన్న అంజయ్య ఆయిల్‌పామ్ పంట సాగు చేసి మూడేళ్లలోనే దిగుబడిని సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. తొర్రూరు మండలంలో1100ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుండగా అంజయ్య తొలి దిగుబడిని సాధించాడు. మూడేళ్ల ఆరు నెలల కాలంలో 30 టన్నుల ఉత్పత్తిని సాధించాడు. మండలంలోని కంఠాయపాలెం శివారులో 30ఎకరాల్లో సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటను మంగళవారం ఉద్యాన శాఖ డివిజన్ అధికారి రాకేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టు కింద 30 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగు చేశానని, 90 శాతం సబ్సిడీతో డ్రిప్, మొక్కలు అందించినట్లు తెలిపారు. సాగు కోసం ఎకరానికి రూ.20వేలు ఖర్చు చేశానన్నారు. ఆయిల్ ఫెడ్, ఉద్యాన శాఖ నుంచి సహకారం అందిందన్నారు. అంతర పంటలుగా పత్తి, పెసర, వేరుశనగ సాగు చేశానన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి పంట దిగుబడి మొదలైందన్నారు. ఇప్పటి వరకు 30 టన్నుల దిగుబడి సాధించానన్నారు. టన్నుకు రూ.14,437 వస్తుందని, ఆయిల్ ఫెడ్ వాళ్లే పంటను అశ్వారావుపేట పరిశ్రమకు తరలిస్తున్నారన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించే లక్ష్యంతో ఆయిల్‌పామ్‌ను సాగు చేసే రైతులకు రాయితీలు ఇస్తున్నదన్నారు. కంపెనీలు గ్యారెంటీ ధరతో కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టి సారిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాఘవరెడ్డి, సమ్మాల్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలను చూపుతున్న రైతు అంజయ్య, ఉద్యానశాఖ అధికారి రాకేశ్

## కొత్తపేట జీపీ పేరు మార్చాలని వినతి

బయ్యారం, ఏప్రిల్ 16 : మండలంలోని కొత్తపేట గ్రామపంచాయతీ పేరును మార్చాలని గంధంపల్లి గ్రామస్తులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి అలీకి వినతి పత్రం అందజేశారు. పంచాయతీ పరిధిలోని గంధంపల్లి, కొత్తపేట రెండు గ్రామాలు కలిసి ఉండగా ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలలు ఉమ్మడి గంధంపల్లి కొత్తపేట పేరుతోనే కొనసాగుతున్నాయన్నారు. కానీ, గ్రామపంచాయితీకి మాత్రం కేవలం గంధంపల్లి మాత్రమే ఉందని, ఎప్పటి నుంచో ఉన్న ఆనవాయతీని కొనసాగించేందుకు గంధంపల్లి కొత్తపేట పంచాయతీగా నామకరణం చేయాలన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్, రవి, రాంబాబు, వెంకటేశ్వర్లు, కృష్ణా, రామయ్య, సైదులు పాల్గొన్నారు.

సెక్రటరీకి వినతిపత్రం అందిస్తున్న గంధంపల్లి గ్రామస్తులు

## అసత్య ప్రచారం చేయొద్దు

**ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాగ్యం**



ఇనుగుర్తి, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో విద్యార్థినులతో వంట పనులు చేయిస్తున్నారని ప్రచారం చేయడం సరికాదని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బీ భాగ్యం అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. గురుకులంలో వంట కోసం ఎనిమిది మంది ఉన్నారని, పది, ఇంటర్ పరీక్షలు పూర్తయిన విద్యార్థులు సెలవుల్లో తమ ఇండ్లకు వెళ్లినందున ముగ్గురు వంట మాస్టర్లు, మెస్ ఇన్‌చార్జి తొలగించామన్నారు. తనను కావాలనే విధుల నుంచి తొలగించారని ఓ వంటమాస్టర్ రోజా గురుకులానికి వస్తూ పెరుగు, ఆదివారం చికెన్ పెట్టి ఇవ్వాలని డిమాండ్ చేస్తుండగా, తాము నిరాకరించామన్నారు. దీంతో అతను వంటమాస్టర్‌గా ఉన్న సమయంలో మెస్‌లో తీసిన విద్యార్థినుల ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నాడని అన్నారు. కాగా, ఇదే విషయాన్ని విద్యార్థినులను అడుగగా తమతో టీచర్లు ఎలాంటి పనులు చేయించడం లేదని తెలిపారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాగ్యం తెలిపారు.

## రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు

మరిపెడ, ఏప్రిల్ 16 : శ్రీ రామనవమి పురస్కరించుకొని మున్సిపల్ కేంద్రంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. ఆలయ ట్రస్టీ, నిర్వాహకుడు గంట్ల రంగారెడ్డి నేతృత్వంలో ఆలయంలో కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

విరాళం అందిస్తున్న పద్మ, వెంకన్న

## ఆలయ నిర్మాణానికి విరాళం

కేసముద్రం, ఏప్రిల్ 16: మండలంలోని బేరువాడ గ్రామంలో నిర్మిస్తున్న దుర్గమ్మ తల్లి గుడి నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ బండారు పద్మ, వెంకన్న దంపతులు రూ.2,00,116 మంగళవారం విరాళంగా అందజేశారు. దుర్గమ్మ తల్లి ప్రతిష్టాపన మహోత్సవ పూజలను ప్రారంభించారు.

భవానిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## కానిస్టేబుల్‌గా ఎంపికైన భవానికి సన్మానం

దంతాలపల్లి, ఏప్రిల్ 16: మండలంలోని దాట్ల జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థి జంపాల భవాని ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఎంపిక కాగా, మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు సంజయ్, విజయ్, స్వప్న, రమేశ్, మంజూశ్రీ, ప్రభాకర్, ప్రేమ్‌కుమార్, మాదవి, రిషిత పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై జిల్లా అధికారికి వివరిస్తున్న గ్రామస్తులు

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- మండల కేంద్రంలో విచారణ చేపట్టిన డీపీవో హరిప్రసాద్
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

చిన్నగూడూరు, ఏప్రిల్ 16 : అధికారులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ అన్నారు. 'చిన్నగూడూరులో తాగునీటికి కరువు' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా అధికారి మండల కేంద్రంలో పలు కాలనీలను సందర్శించారు. తాగునీరు, వీధిలైట్ల కొరతను గుర్తించి అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉంటూ తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వేసవి పూర్తయ్యే వరకు తాగునీటి సమస్యలు తలెత్తితే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ కృష్ణారెడ్డి, ఎంపీడీవో రామారావు, ఎంపీవో యాకయ్య పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఎంపీ పరామర్శ

ఇనుగుర్తి, ఏప్రిల్ 16 : మండలంలోని చిన్నముప్పారం బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ రాయలి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం దశ దినకర్మ నిర్వహించగా, మహబూబాబాద్ ఎంపీ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ హాజరయ్యారు. వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట నెల్లికుదురు జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవీనవీన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరిపాటి వెంకట్‌రెడ్డి, యాసం రమేశ్, బిక్కూనాయక్, బండారి శ్రీనివాస్‌రెడ్డి, చీకటి ప్రవీణ్, నామాల మహేశ్, చందు పాల్గొన్నారు.

## చెరువుల్లో తవ్వకాలు నిలిపివేయాలి

మరిపెడ, ఏప్రిల్ 16 : ఇటుక బట్టీల నిర్వాహకులు చెరువుల్లో నల్లరేగడి మట్టిని తవ్వుతూ ఊళ్లను వల్లకాడు చేస్తున్నారని శాలివాహన సంఘం మండల అధ్యక్షుడు అల్వాల ఉపేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిపెడతోపాటు వెంకంపాడు తదితర గ్రామాల్లోని చెరువుల్లో అక్రమంగా నల్లరేగడి తరలిస్తూ చెరువుల చెర బట్టినట్లు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు నల్లరేగడి తవ్వకాలకు అనుమతి ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తున్నదన్నారు.

## మున్సిపాలిటీలో నీటి తొట్ల ఏర్పాటు

**మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి**

మహబూబాబాద్, ఏప్రిల్ 16: వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకే మహబూబాబాద్ మున్సిపాలిటీ ద్వారా నీటి తొట్లు ఏర్పాటు చేశామని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నీటి తొట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. మూగజీవాల కోసం ప్రత్యేకంగా 14 ప్రాంతాల్లో నీటి తొట్లను ఏర్పాటు చేశామన్నారు. నిత్యం వాటిలో నీరు ఉండేలా మున్సిపాలిటీ సిబ్బంది పని చేస్తున్నారని అన్నారు.

నీటి తొట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

## ఎస్సై ఆర్థిక సాయం

దంతాలపల్లి, ఏప్రిల్ 16: మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి కన్నెబోయిన కృష్ణమూర్తి గొర్రెలను మేపేందుకు వెళ్లి వడదెబ్బతో మృతి చెందారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై కరుణాకర్, వైద్యాధికారి చైతన్య మంగళవారం కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎస్సై రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

## మాత, శిశు సంరక్షణే ఐసీడీఎస్ లక్ష్యం

మరిపెడ, ఏప్రిల్ 16 : మాత,శిశు సంరక్షణే లక్ష్యంగా అంగన్‌వాడీ సెంటర్లు పని చేస్తున్నాయని మరిపెడ సీడీపీవో శిరీష తెలిపారు. మంగళవారం మండలంలోని తండధర్మారం, లచ్చాతండాల్లోని అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారంతోపాటు ప్రాథమిక విద్య అందజేస్తుననట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పోషకాహారాన్ని తప్పక తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సుశీల, లీలాబాయి, శాంతి, పద్మ, రోజ, భగవతి, పద్మ పాల్గొన్నారు.

## ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన వైస్ ఎంపీపీ

పెద్దవంగర, ఏప్రిల్16 : పెద్దవంగర మండల ఎంపీపీ బాధ్యతలను ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో వైస్‌ఎంపీపీ బొమ్మరబోయిన కల్పనాయాదవ్ మంగళవారం స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్చి 23న ఎంపీపీ ఈదురు రాజేశ్వరిపై అవిశ్వాసం నెగ్గడంతో పదవిని కోల్పోయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ బాధ్యతలను వైస్ ఎంపీపీ స్వీకరించింది. ఎంపీటీసీ రవీందర్‌నాయక్, తొర్రూరు వైస్ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు సోమన్ననాయక్, శ్రీనివాస్, రాజుయాదవ్, వెంకన్న, మోహన్‌రావు పాల్గొన్నారు.

## వైభవంగా మహా కుంభాభిషేకం

బయ్యారం, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలోని కోదండ రామచంద్రస్వామి ఆలయ జీర్ణోద్ధరణ సందర్భంగా మంగళవారం ఆలయంలో మహా కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారామచంద్ర స్వామి, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలకు పంచామృతాభిషేకం, అర్చన, అలంకరణ తదితర పూజలను సాయితరుణ్ శర్మ నిర్వహించారు. బుధవారం సీతారాముల కల్యాణాని ఘనంగా నిర్వహించనున్నారు. కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, వేం యాకూబ్‌రెడ్డి, బోస్, వైఎస్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, శ్రీను పాల్గొన్నారు.

## వడదెబ్బతో రైతు మృతి

అబ్బయ్య(ఫైల్)

కేసముద్రం, ఏప్రిల్ 16: వడదెబ్బతో రైతు మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలోని కల్వల గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుదురుపాక అబ్బయ్య(70) ఉదయం గేదెలకు గడ్డి తేవడానికి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం వరకూ ఇంటికి రాకపోవడంతో ఆయన కొడుకు వేణు బావి వద్దకు వెళ్లి చూడగా అబ్బయ్య అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే 108 వాహనానికి సమాచారం ఇవ్వగా, అది వచ్చేలోపే మృతి చెందాడు. అబ్బయ్యకు భార్య ఉప్పలమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## మతోన్మాద శక్తులకు అడ్డుకట్ట వేయాలి

మహబూబాబాద్, ఏప్రిల్ 16 : రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తూ మనువాద భావజాలాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దుతున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ చర్యలు అడ్డుకోవాలని మహబూబాబాద్ జిల్లా వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ, ఎంసీపీఐ, సీపీఐ(ఎంఎల్) నాయకులు జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎంసీపీఐ, సీపీఐ(ఎంఎల్) పార్టీల నాయకులు విజయ్‌సారధిరెడ్డి, సాదుల శ్రీనివాస్, గౌని ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, గోనే కుమారస్వామి, కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, మోదీ పదేళ్ల పాలనలో పౌర ప్రజాస్వామ్య హక్కులను కాలరాశారని అన్నారు. సదస్సులో బట్టు చైతన్య, పెరుగుకుమార్, గునిగంటి రాజన్న, కంచ వెంకన్న, హలావత్ లింగన్న, ఉమ్మగాని సత్యం, ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, దుడ్డెల రామ్మూర్తి, సీతారాంనాయక్, రేషపల్లి నవీన్, వెంకన్న, శ్రవణ్, అశోక్ పాల్గొన్నారు.

## బావిలో పడి వ్యక్తి మృతి

సారయ్య (ఫైల్)

కేసముద్రం, ఏప్రిల్ 16: బావిలో పడి రైతు మృతి చెందిన మండలంలోని కల్వల గ్రామ శివారులో మంగళవారం జరిగింది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన చిర్రగోని సారయ్య (55) కేసముద్రం మం డలం అమినాపురం గ్రామంలో కుటుంబం తో కలికి ఉంటున్నాడు. అనారోగ్యానికి గురైన సారయ్య మనస్థాపంతో ఈ నెల 13న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కనిపించపోయిన సారయ్య మంగళవారం కల్వల శివారులోని వ్యవసాయ బావిలో శవమై తేలాడు. పోలీసులు బావి వద్దకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. సారయ్య గతంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా, మార్కెట్ వైస్ చైర్మన్‌గా పని చేశాడు.